

# ఔన్నత్యం

పంజాల జగన్నాథం

ఆ రోజుల్లో రామచంద్రయ్యకు పెద్ద ఆదాయం గానీ, పెద్ద పెద్ద ఖర్చులు గానీ, సమస్యలు గానీ లేవు. కాలం నీడలో నిశ్చింతగా నిద్రపోయిన రోజులవి. పాతికేళ్లు గడిచిపోయాయి. ఈ పాతికేళ్లలో ఎన్నో మార్పులు. జీవితంలో ఒక దశ నుండి మరో దశకు చేరుకున్నాడు. బాధ్యతలు పెరిగాయి. బాధలు పెరిగాయి. ఉదయం జరిగిన సంఘటన రామచంద్రయ్య హృదయాన్ని కలిచి వేయసాగింది.

రామచంద్రయ్య ప్రైమరీ స్కూలు టీచరు. ఆస్థి పాస్థులు పెద్దగా లేవు. మధ్య తరగతి కుటుంబీకుడు. సంసారాన్ని గుంభనంగా వెళ్ళదీసుకుంటున్నవాడు. ఇతరులను చేయి చాపకుండా క్రమశిక్షణతో, ప్రణాళికా బద్ధంగా ఉన్న దాంట్లోనే మిగుల్చుకుని అవసరాలను వెళ్లదీసుకుంటున్న సగటు మనిషి.

రామచంద్రయ్యకు ఇద్దరు కొడుకులు. ఒక

క ారు. పెద్దబ్బాయి కృష్ణ బి.యస్.సి, బి.ఇ.డి. ఉద్యోగం లేదు. షాపులల్లో చిట్టా పద్దులు రాసి కొద్దో గొప్పో సంపాదిస్తున్నాడు. వయస్సులో ఉన్న కొడుకు ఎక్కడ చెడిపోతాడేమోనని, జీవితంలో స్థిరపడుకున్నా అందుబాటులో ఉన్న ఓ మంచి సంబంధం చూసి పెద్దబ్బాయి కృష్ణకి పెళ్లి చేశాడు రామచంద్రయ్య. కట్నానికి ఎక్కువ ఆశపడలేదు. అమ్మాయి రూపవతి, గుణవతి అయితే చాలనుకున్నాడు. కొడుకు, కోడలు చిలకా గోరింకల్లా అన్యోన్యంగా కాపురం చేస్తుంటే రామచంద్రయ్య, ఆయన భార్య గాయత్రి ముచ్చటపడ్డారు. కోడలు ప్రియాంక కూడ అత్త, మామల పట్ల గౌరవ మర్యాదలతో, భర్త పట్ల అనురాగంతో మెలగ సాగింది. రామచంద్రయ్య చిన్న అబ్బాయి హరి ఇంటర్, కూతురు శరణ్య యస్.యస్.సి చదువుతున్నారు. హరిని ఇంజనీర్ చేయడం, శరణ్యకు ఓ మంచి సంబంధం చూసి పెళ్లి చేయడం ఇవి రామచంద్రయ్య జీవితాశయాలు.

✡ ✳ ✡

రామచంద్రయ్య కుటుంబంలో సమస్యల కలకలం మొదలయ్యింది. ఇప్పటివరకు రాంచంద్రయ్యే అన్నీ తనే అయి కొడుకు, కోడలు అవసరాలన్నింటినీ తీర్చుకుంటూ వచ్చాడు. పోషించాడు. ఈ రోజు డి.యస్.సి.లో టీచరు ఉద్యోగం రాగానే భార్యమాటలు విని.... స్వార్థంతో వేరు పడుతాననడం - వాళ్లకు వాళ్లే బతుకుతామనడం రామచంద్రయ్య జీర్ణించుకోలేక పోతున్నాడు. కొడుకు సంపాదనా పరుడయ్యాక తన బరువు బాధ్యతలని పంచుకుంటాడనీ, తమ్ముడి చదువుకి, చెల్లెలు పెళ్లికి సహకరిస్తాడని ఆశపడ్డాడు. కాని ఇంతటి బాధ్యతా రాహిత్యం, ఎస్కేపిజమ్ పెద్దబ్బాయిని ఆశ్రయిస్తుందని రామచంద్రయ్య ఏనాడూ ఊహించలేదు.

'ఒకప్పుడు తాతముత్తాతలు మనుమలు, మనుమరాండ్లు పుట్టే వరకు కూడా కలసి సహజీవనం చేశారు. ఆ కాలంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంత బలమైన పునాదులతో ఉండేది. రాను రాను ఉమ్మడి కుటుంబ సభ్యుల్లో స్వార్థం పెరిగి కొందరు వృద్ధి చెందడం, కొందరు వెనుక బడి పోవడం - ఆర్థిక అసమానతలు ఏర్పడడం.... ఈ పరిణామక్రమంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పూర్తిగా విచ్ఛిన్నమైంది. ప్రస్తుతం కుటుంబం అంటే కేవలం భార్యా పిల్లలు అనే స్థితికి చేరింది. తరాలు మారినా ఈ తరం పిల్లలు ఇంత ఘోరంగా మారడమా?! రెక్కలొచ్చిన పక్షుల్లా ఇలా ఎగిరి పోతే వృద్ధ తల్లిదండ్రులగతేమిటి? ఆస్థితిలో వాళ్లకు సంపాదనా, ఒంట్లో శక్తీ క్షీణిస్తాయి! లోలోన రామచంద్రయ్య ఎంతగానో మదన పడసాగాడు.

ఇది సంధికాలం. పాత కాలానికి, ఆధునికతకి మధ్యస్థంగా ఉన్నప్పుడు కొన్ని సమస్యలు తప్పవేమో....! గాఢంగా నిట్టూర్చాడు రామచంద్రయ్య.

రామచంద్రయ్య ఆరు బయట వేప చెట్టు నీడన వాలు కుర్చీలో కళ్లు మూసుకుని యోగ ముద్రలో ఉన్నట్టుగా కూర్చున్నాడు. ఆయన మనస్సు పరి పరి విధాల ఆలోచిస్తోంది. ఆతని అంతరంగంలో అశాంతి తుఫానులా చెలరేగుతోంది.

హరికి ఎమ్‌సెట్‌లో ర్యాంకొచ్చింది. రామచంద్రయ్యకు తన చిన్నబ్బాయిని ఇంజనీరుని చేయాలన్న తన చిరకాల వాంఛ ఫలించబోతోంది. మనసు నిండా సంతోషం. కానీ డబ్బు సమస్య రామచంద్రయ్య మనస్సును తొలుస్తోంది. హరిని కాలేజిలో సెటిల్ చేసేవరకు ఫీజులు, బట్టలు, పుస్తకాలు వగైరా అన్నీ కలుపుకుని ఎంత లేదన్నా ఓ ముప్పై వేల వరకు ఖర్చు అవుతుంది. పెద్దబ్బాయి కృష్ణ స్వార్థంతో వేరయిపోయి బాధ్యతల్నించీ తప్పించుకున్నాడు. రామచంద్రయ్య కళ్లల్లో తడి కనబడసాగింది.

రామచంద్రయ్య అమాయకత్వాన్ని చాలా మందే వాడుకున్నారు. గతంలో ఓసారి డబ్బులు అత్యవసరంగా ఉన్నాయని, రామచంద్రయ్య షడ్డకుడు ఆయన వద్ద ఓ పదివేలు అడిగి నెల రోజుల్లో తిరిగి ఇస్తానని చెప్పి వెళ్లాడు. సంవత్సరం కావస్తోంది. డబ్బుల జాడ లేదు.


హరిని ఇంజనీరింగ్‌లో జాయిన్ చేయాలి. డబ్బు చాలా అవసరముంది. పంపించమని కబురు చేస్తే జవాబు లేదు. మనుషులు డబ్బులు అందక ముందు ఒకరకంగా, డబ్బులు అందాక మరో రకంగా ఉంటున్నారు. ఒకరి అవసరాలు ఇంకొకరికి పట్టవు. మనుషుల్లో నిజాయితీ లేదు. వాపోయాడు రామచంద్రయ్య.

పెద్దబ్బాయిని తమ్ముడి చదువుకు సహాయం చేయమని అడుగుదామని ఓ రోజు కృష్ణ ఇంటికి వెళ్లాడు రామచంద్రయ్య.

"ఒరే కృష్ణా! హరికి ఇంజనీరింగ్‌లో సీటొచ్చింది. డబ్బుకు చాలా ఇబ్బందిగా ఉంది ఏమైనా సర్ధగలవా?" అని అడిగాడు.

"నాన్నా! నా దగ్గర డబ్బు లెక్కడివి? ఈ మధ్యనేగా ఉద్యోగం వచ్చిందీ!" పొడిపొడిగా జవాబు చెప్పాడు కృష్ణ. రామచంద్రయ్య మనస్సు కలుక్కుమంది. ఆయనకు తెలుసు వాడు నిరుద్యోగిగా ఉన్నప్పుడే కమీషన్ మీద చిట్టీలు నడిపించి, షాపులల్లో చిట్టా పద్దులు రాసి డబ్బు సంపాదిస్తున్నాడని. దీర్ఘంగా నిట్టూరుస్తూ.... కలికాలం ఏం చేద్దాం! వాడి స్వార్థం వాణ్ణలా మాట్లాడిస్తుంది. రామచంద్రయ్య మనస్సు మూగగా రోదించింది. స్నేహితులు తీసుకున్న 'చేబదళ్లు' కూడా సమయానికి అందలేదు.

హరి విద్యలో చురుకైనవాడు. బుద్ధిమంతుడు. చిన్నబ్బాయి తప్పకుండా వృద్ధిలోకి రాగలడనే విశ్వాసం రామచంద్రయ్యకుంది. ఎలాగయినా డబ్బు సమకూర్చి హరి చదువు కొనసాగించాలి. అనే పట్టుదలతో ఉన్నాడు. బుర్రలో తళుక్కున ఓ ఆలోచన మెరిసింది. సేట్ కిషన్ లాల్ గుర్తొచ్చాడు.



✡ ✳ ✡

"ఏమండీ మజ్జిగ" భార్య గాయత్రి పిలుపుతో కళ్లు తెరిచాడు. ఎదురుగా మజ్జిగ గ్లాసుతో గాయత్రి. ప్రౌఢ వయస్సులోని గాయత్రి కాటన్ చీరలో నుదుట కుంకుమతో మహాలక్ష్మిలా ఉంది. తలలో అక్కడక్కడా నెరిసిన వెంట్రుకలు ఆమె హుందాతనాన్ని ద్విగ్విణీకృతం చేస్తున్నాయి. నిర్మలమైన ఆమె ముఖాన్ని చూసిన రామచంద్రయ్యకు ఎక్కడ లేని మనోధైర్యం వచ్చింది. ఒక్కసారి సమస్యలన్నీ పటాపంచలయినట్లు అనుభూతి పొందాడు. భార్య ఇచ్చిన మజ్జిగ తాగి కండువాను భుజాన వేసుకున్నాడు.

"గాయత్రి నేను సేట్ కిషన్ లాల్ వద్దకు వెళుతున్నాను." అంటూ ఇంట్లోంచి బయలుదేరాడు. సేట్ వద్ద కావలసిన డబ్బు అప్పు తీసుకున్నాడు. రామచంద్రయ్య పరువు, మర్యాద గల వ్యక్తి కనుక సేట్ సునాయాసంగానే అప్పు ఇచ్చాడు. హరికి కాలేజీలో కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో అడ్మిషన్ ఇప్పించాడు. ఉన్నదాంట్లోనే పొదుపు చేసుకుంటూ నెలనెలా డబ్బు పంపిస్తున్నాడు రామచంద్రయ్య. హరి చదువు సజావుగా సాగుతోంది.

✡ ✳ ✡

కాలం గిర్రున తిరిగింది. కొన్ని సంవత్సరాలు గడిచాయి. కాలగమనంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పుడు హరి ఓ పెద్ద పేరు మోసిన ప్రయివేటు కంపెనీలో కంప్యూటర్ ఇంజనీరు. నెలకు ఇరువై వేల జీతం, కారు బంగళా, మంచి హోదా రామచంద్రయ్య హరికి నచ్చిన అమ్మాయితో పెళ్లి చేశాడు. ఆ అమ్మాయి అదే కంపెనీలో కంప్యూటర్ శాఖలో ఇంజనీర్‌గా పనిచేస్తోంది. హరి తన చెల్లెలు శరణ్యకు ఓ మంచి డాక్టర్ సంబంధం చూసి ఘనంగా పెళ్లి చేశాడు. హరి తన తల్లిదండ్రుల్ని ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాడు. ఇప్పుడు రామచంద్రయ్యకు ఉన్న దిగులల్లా తన పెద్ద కొడుకు కృష్ణ కుటుంబం బాధల్లో ఉందని, ఆర్థికంగా చితికి పోయిందని.

కృష్ణ ఇప్పుడు ముగ్గురు పిల్లల తండ్రి. చాలీ చాలని జీతం. జీతానికి మించిన కోరికలతో నిత్యం పోరాడుతున్న కృష్ణను అకాల వార్ధక్యం ఆక్రమించింది. భార్య ప్రియాంక ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే ఉంది. పోషణ సరిగా లేక పిల్లలు చిక్కిపోయారు. వైద్యం ఖర్చులు, చదువుల అవసరాలు ఇలా కృష్ణపై ఎంతో ఆర్థిక భారం పెరిగింది.

కృష్ణ పెద్ద కొడుకు ప్రదీప్ చిన్నాన్న హరి లాగానే చదువులో చురుకయినవాడు. ఎమ్‌సెట్. మెడిసన్‌లో మంచి ర్యాంకు సాధించాడు. ప్రదీప్‌ను మెడిసిన్ చదివించడం కృష్ణ తాహతుకు మించిన పని. తమ్ముడు హరి వద్దకు వెళ్లి కొడుకు చదువు గురించి అర్థిక సహాయం అడగడానికి సంకోచిస్తున్నాడు. అభిమానం అడ్డొస్తోంది. అందుకు కారణం గతంలో హరి చదువు పట్ల తను చూపిన బాధ్యతా రాహిత్యం, అనుచిత ప్రవర్తనే. అయినా ధైర్యం చేసి కృష్ణ ఆతని భార్య ప్రియాంక హరి వద్దకు బయలుదేరారు. గుమ్మంలోంచి దూరంగా కనబడ్డ కొడుకూ, కోడల్ని చూసి ఆనందంతో రామచంద్రయ్య కళ్లు చెమర్చాయి.

"నాన్నా! మీ మనుమడు ప్రదీప్‌కు మెడిసన్‌లో సీటొచ్చింది." అంటూ మొహమాటం పడుతూనే నసిగాడు కృష్ణ.

"ఔను మామయ్యా! వాడు అచ్చం మరిది పోలికలే. వాడి చదువుకు డబ్బు....." అంటూ నసిగింది.

"అమ్మా ప్రియాంకా! ఇంత కాలానికి మేం గుర్తొచ్చామా! ప్రేమనేది మనసులో ఉండాలే కానీ... ఈ దూరాలెందుకుంటాయి." గాయత్రి గుండెల్లో బాధ వెళ్ల గక్కింది.

"బాబా కృష్ణా! అమ్మా ప్రియాంకా! మనుషుల మధ్య ప్రేమ పుట్టడానికి డబ్బే పునాది కాకూడదు.... అయినా ఈతరం పిల్లలు మమతలు - మానవ సంబంధాలు అన్నీ మరిచిపోతున్నారు." రాంచంద్రయ్య హితవు చెప్పాడు కొడుకూ, కోడలికి.

నేల చూపులు చూస్తూ అలాగే నిలుచున్నారు కొడుకు, కోడలు.

"సరేనమ్మా! మీ మరిది హరొచ్చాక విషయం చెబుతాను" అంటూ విషయం తేల్చి వేశాడు రామచంద్రయ్య.

టీ. టిఫిన్‌ల అనంతరం కృష్ణ ప్రియాంకలు వెళ్లిపోయారు.

✡ ✳ ✡

అడ్మిషన్ తేది దగ్గర పడుతోంది. హరి 'ప్రదీప్'ను పిలిపించుకున్నాడు. విషయం తెలుసుకుని తనే స్వయంగా ప్రదీప్‌ను వెంట తీసుకుని యూనివర్సిటీకి వెళ్లాడు. మెడిసన్‌లో అడ్మిషన్ ఇప్పించాడు. హాస్టల్ వసతి, బట్టలు, పుస్తకాలు అన్నీ ఏర్పాటు చేశాడు.

"బాబూ ప్రదీప్! నీవేం దిగులు పడకు. నెల నెలా డబ్బులు నేను పంపిస్తాను. బాగా చదువుకో." అని చెప్పి తిరిగి ఊరొచ్చాడు.

తండ్రి రామచంద్రయ్య ద్వారా కొడుకు అడ్మిషన్ తెలుసుకున్న కృష్ణ ప్రియాంకలు చాలా ఆనందపడ్డారు. గతంలోని తన అనుచిత ప్రవర్తనకు సిగ్గుతో కుంచించుకుపోయాడు. ఎంతో పశ్చాత్తాపపడ్డాడు. అమ్మా, నాన్నల కాళ్ల మీద పడి తన తప్పును క్షమించమని బోరుమన్నాడు.

ఊరినించి తిరిగొచ్చిన తమ్ముడు హరిని గుమ్మంలోంచే చూసి గాలికి విసిరేసిన ఆకులా పరుగున వెళ్లి ఆనందంతో కౌగిలించుకున్నాడు. తమ్ముడు ప్రదర్శించిన ఉదాత్తతకి, ఔన్నత్యానికి, హృదయ సంస్కారానికి దాసోహ మన్నాడు కృష్ణ.

✳



## బాధ

*బాలు చేసిన ప్రయత్నం అంతా బూడిదలో పోసిన పన్నీరే అయ్యింది. 'పాడుతా-తీయగా' ప్రోగామ్ ద్వారా ఎందరో వర్ధమాన గాయనీ గాయకుల్ని వెలుగులోకి తీసుకువచ్చాడు.*

*ముఖ్యంగా తెలుగుభాషలోనూ, భావ ప్రకటనలోనూ అవసరమయిన మెళకువల్ని ప్రస్తుతిస్తూ ఒక మంచి మాట ముగింపుతో జనరంజకంగా తీర్చిదిద్దిన ఆ కార్యక్రమం చూసి ఆబాలగోపాలం హర్షం వ్యక్తం చేసింది. అయితే ఈరోజు తెలుగు సినిమాల్లో భాష తెలియని గాయినీ, గాయకులు పాడుతుంటే చాలా బాధగా వుందని చెప్పడం కంటే రోతగా వుందని చెప్పడం సముచితం.*

*'పాడుతా తీయగా' కార్యక్రమం ఓ మహాయజ్ఞంలా సాగింది. ఆ 'ఫలాన్ని' తెలుగు ప్రేక్షకులకు అందిద్దాం! పరభాషా వ్యామోహంలో తేనె తెలుగు తీయదనాన్ని విషతుల్యం చేయకుండా మనల్ని మనం కాపాడుకుందాం అంటాడు బాలు.*